



**ఆ వూరు కూడా అన్ని వూళ్ళలాగే వుంటుంది. అయితే అందులో విశేషం ఏమీ లేదు.**

ఆ వూరికి యింకా ఎలక్ట్రిసిటి రాలేదు. ఇంటింటికీ దీపం అన్న నినాదం మాత్రం వెలుగుతోంది. ఆ వూరికింకా బస్సు రాలేదు. పల్లెపల్లెకీ బస్సు అన్న మంత్రిగారి మాట మాత్రం ఆ గాంధీ జయంతినాడు వినిపించింది. ఇవన్నీ ఎలా వున్నా ఆ వూరికి తపాలా సౌకర్యం మాత్రం లేదు.

ఆ వూరికి దగ్గర్లో వున్న సబాఫీసు నుంచి వారానికోసారి తన వూరెళుతూ ఆ ఆరురోజుల్లో వచ్చిన టపా, ఏడు రోజులూ వచ్చిన వార్తాపత్రికలు యిచ్చి వెళతాడు. ఆ వూరికి ఆ రోజు పర్వదినం. దేశానికంతా సంక్రాంతి, ఉగాది, దసరా పర్వదినాలయితే అన్నీలేని ఆ వూరికి శనివారం మాత్రం పర్వదినం.

సాయంకాలం అయిదు గంటలు దాటినప్పటి నుంచీ ఊరి మొగసాల్లో వున్న రచ్చ చావిడి ముందు జమవుతారందరూ! మునసబు, కరణాలూ, సర్పంచీ, గ్రామ ప్రముఖులూ అందరూ రచ్చ ముందే వుంటారు. మిగతావాళ్లు రచ్చబండ క్రిందుగా వుంటారు. టెలిగ్రాములూ, ఉత్తరాలూ, దిన పత్రికలూ ఎప్పుడెప్పుడు వస్తాయా అని ఎదురు తెన్నులు చూస్తూ వుంటారు.

సరిగ్గా అయిదు నిమిషాలు తక్కువ ఆరు గంటలకి వచ్చాడు రామచంద్రుడు. అతని సర్వీసంతా పోస్టుమెన్‌గానే గడిచిపోయింది. పెళ్లైన కొత్తలో వచ్చిన ఉద్యోగం, పాన్పుమీద మామగారిచ్చిన సైకిల్ రెండూ పాతబడిపోయాయి. పెళ్లైన కొత్తలో అరగంటకల్లా డ్యూటీకి చేరేవాడు. తర్వాత్తర్వాత ప్రయాణం గంటదాకా పెరిగింది. రివ్వున దూసుకెళ్లే సైకిల్ యిప్పుడిప్పుడు మెల మెల్లిగా వెళుతోంది.

"ఇంకా రాడేం రామచంద్రుడు ?" అడిగాడు కరణం.

"అదిగో వస్తోనేవున్నాడు!" అన్నాడు మునసబు.

"నిండు నూరేళ్లు బ్రతికిపోతాడా !" అందుకున్నాడు సర్పంచ్.

సైకిల్ దిగేడు రామచంద్రుడు. గద్దలాగా అతని చేతిలోని వార్తాపత్రిక అందుకున్నాడు సర్పంచ్. ఏడురోజుల పత్రికలూ తాజా వార్తల్లాగా చదువుకుంటాడతను. అక్కడినుంచి టీచర్ యింటికి, అక్కడనుంచి మునసబు, కరణాల యింటికీ వెళతాయి అవి. వీక్లీ కూడా అందించాడు రామచంద్రుడు.

"ఉత్తరాలున్నాయా ?". ముగ్గురూ ఒకేసారి అడిగారు.

''ఆ'' అంటూ ముందు సర్పంచ్‌కి అందించాడు. ఒకటి అల్లుడు రాసిన ఉత్తరం. అమ్మాయిని పిలుచుక రమ్మని. 'అబ్బో రేపే వెళ్లాలే' అనుకుని గాబరాపడ్డాడు అతను. మరో ఉత్తరం డి. ఎల్. పి. వో. నుంచి. కేంప్ వస్తున్నానని — అతనూ రేపే దిగబడుతున్నాడు. 'ఎలారా భగవంతుడా ?' అనుకున్నాడు సర్పంచ్.

కరణానికి, మునసబుకి మామూలు క్షేమ సమాచారాల ఉత్తరాలే వచ్చాయి. ముందుకి కదిలాడు రామచంద్రుడు.

వీధి మలుపు తిరుగుతూ వుండగానే ఎదురయ్యాడు శివయ్య. శివయ్య శివాలయం పూజారి. సాక్షాత్తూ వీరభద్రుడిలా వుంటాడతను. దాదాపు ముప్ఫయి ఏళ్లు వచ్చేవరకూ పెళ్లీ పెటాకులూ లేకుండా గడిపిన శివయ్య ఊర్లోవాళ్ల ఓ యింటివాడివి కమ్మని పోరటంతో దక్షిణాదికి వెళ్లి ఓ మళయాళీ అమ్మాయిని కొనితెచ్చుకున్నాడు.

సీతాలుగా మారిన ఆ అమ్మాయి తెలుగు నేర్చుకుని, శివయ్యకి అర్థమై, అర్థమయ్యే సమయంలో ఓ యువకుడు ఆమెని తనతో లేవదీసు కెళ్లాడు. గుండె గాలమైందావార్త శివయ్యకి. అంతే ! వరద రాకముందూ, వరద తీశాకా నిశ్చలంగా వుండే నదిలా అయిపోయాడు శివయ్య.

శివయ్యకి ఎవరూ లేరు. స్మశానవాసికీ శివయ్యకీ ఆట్టే తేడా లేదు. నిర్లిప్తతలో, నిర్వికారంలో సాంబశివుడికి సాటి శివయ్య.

'ఉత్తరం శివయ్యగారూ !'

ఆశ్చర్యపోయాడు శివయ్య. అతని యీ నలభయ్యయిదు సంవత్సరాలవయస్సులో అతనుత్తరం రాయలేదు. అతని కెవరూ వుత్తరం రాయలేదు. ఎవ్రరాశారా యిప్పుడంటూ ఆశ్చర్యంగా అందు కున్నాడు. ఉత్తరం చించాడు. చించి చదివాడు. అక్షరాలవెంట కళ్లు పరిగెత్తేకొద్దీ అతని ముఖంలో అసహ్యం, కోపం చకచకా పరిగెత్తాయి. ఉత్తరం పూర్తవగానే స్సరున చించాడు శివయ్య.

శివయ్య చేష్టలు చూసిన రామచంద్రుడు ఆశ్చర్యపోయాడు. సహా శివుడు ప్రళయకాల రుద్రుడయ్యాడే అనుకున్నాడు. అందుకే అలాగే చూస్తూ వుండిపోయాడు.

ఉత్తరం చించివేసినా అందులోని మాటలు మాత్రం అతని కళ్లెదుటే కనిపిస్తున్నాయి.

శివయ్యగారూ !

మీరిప్పటికి నన్ను మరిచిపోయేవుంటారు. అవును నేను చేసిన ద్రోహానికి మీ రా శిక్షే విధించి వుంటారు. అది ధర్మమే. అందుకే యిప్పుడు నన్ను నేను గుర్తు చేసుకుంటున్నాను. నేను చెంగాయిని, మీ సీతాలుని. మీ భార్యనై ఆరు నెలలు మీతో కాపురం చేసి ఓ దుర్మార్గుడి వెంట లేచిపోయినదాన్ని.

ఇప్పటికీ మీకు ఉత్తరం రాయకూడదనే అనుకున్నాను. కానీ మన సంతానం — మన అబ్బాయి — అవును నేను లేచివెళ్లేనాటికే వాడు గర్భాన వున్నాడు — వాడికోసం రాస్తున్నాను. నేను వెంటవచ్చిన రెడ్డిగారబ్బాయి నాపై మోజు తీరగానే నన్ను దార్లో వదిలేసి వెళ్లాడు. అప్పటినుంచీ నేను

# చల్లగా వర్థిల్లు

జాగ్రత్తగానే బ్రతికాను. నాకు యిప్పుడు కాన్సర్ వ్యాధి. పిల్లవాడికి పదకొండేళ్లు. నే నెటూ పోవటం ఖాయం. అందుకే వాడిని మీవద్దకి చేర్చాలని నా తపన.

మీరు హాలాహలం మింగిన శివుడిలా నన్ను క్షమిస్తారనీ, కుమారస్వామిని కాపాడతారనీ ఆశిస్తూ కొండంత నమ్మకంతో యీ వుత్తరం రాస్తున్నాను.

మరోసారి మండిపోయిన నా బ్రతుకుని పండించండి.

మీ దాసి,
సీతాలు.

ఉత్తరం గుర్తుకు రావటంతో 'శివ శివా !' అనుకుంటూ వెళ్లిపోయాడు శివయ్య.

ఆశ్చర్యంగా కదిలాడు రామచంద్రుడు.

మరో వీధి తిరిగి 'మామా !' అంటూ కేకేశాడు అతను.

లోపలినుంచి డెబ్బయి ఏళ్ల వృద్ధుడూ, ఓ ముసలమ్మా బయటికి వచ్చారు. 'ఓల్డ్ ఏజ్ పెన్షన్' తెచ్చాడు రామచంద్రుడు. ఇద్దరూ సంతకాలు చేసిన తర్వాత ఎవరి డబ్బు వాళ్లకి యిచ్చాడు.

''రామచంద్రుడూ ! మేమిద్దరం ప్రేమించు కున్నాం. మావాళ్లు ఒప్పుకోకపోటంతో యిద్దరం విడివిడిగా పెళ్లిళ్లు చేసుకున్నాం. నా భార్య పోయింది. కూతుళ్లు అత్తారింటికి, కొడుకులు ఉద్యోగాలకి పోయారు నన్ను గాలికి వదిలేసి. ఆమె భర్త పోగానే ఆమె గతీ అలాగైంది. భగవంతుడు మమ్మల్నిద్దర్నీ యిప్పుడు కలిపాడు అనుకుని కలసి బతుకుతున్నాం. ఎవరేమనుకున్నా మాకు లెక్కలేదు. కానీ నువ్వు మమ్మల్నిద్దర్నీ విడివిడిగా చూస్తూ డబ్బు యిలా యివ్వడం బాగాలేదు'' అన్నాడు ముసలాడు.

'కిష్టయ్య మామా ! ఇది ఉద్యోగ ధర్మం ! అంతే !' అంతకుమించి యింకేమీ అన్లేదు రామచంద్రుడు. మెల్లిగా ముందుకి కదిలివెళ్లాడు డ్యూటీమీద.

మరో మలుపు తిరగ్గానే ఎదురైంది చంద్రమ్మ.

'చంద్రమ్మా ! మణియార్డరు !' నవ్వుతూ అన్నాడతను.

'ఎక్కడినుంచి ?'

'ఇంకెక్కడినుంచి, మద్రాసులో సినిమాలో నటిస్తున్న నీ కూతురునుంచి !'

'ఆ ముదనష్టపుదాన్నుంచేనా ?'

'చంద్రమ్మా ! చిత్రం చిత్రమా అని ఏమ్మాట్టాడతావ్ ! అందరూ సినిమాల్లో చేరాలని ఎగబడుతూ వుంటే కాంతమ్మని తిడతావేం ?' వేలిముద్ర వేయించుకుని, డబ్బిస్తూ అన్నాడు.

'చిత్రం చిత్రమాని ! నువ్వూ నమ్ముతున్నావా రామచంద్రుడూ ! అది సినిమాల్లో వెయ్యటం లేదయ్యా ! దాని ముఖానికి వేషాలెక్కడివి ? అది ఒళ్లమ్ముకుని బతుకుతోంది. ఆ మాట సీతో చెప్పకోగలను — నువ్వు రామచంద్రుడివి. కానీ అందరితో ఎలా చెప్పగలను ?' అంది విషాదంగా.

'ప్చ్ ! ఎవరి కర్మ కెవరు కర్తలు !' అని కదిలాడు రామచంద్రుడు. అతను నాలుగడుగులు వెయ్యగానే రిటైర్డ్ టీచర్ జాన్ ఎదురయ్యాడు.

'ఎనీ ఎం. వో ?'

'లేదు సార్ !'

'ఎనీ లెటర్ !'

'నో సర్ !'

'థాంక్యూ !' అన్నా జాన్‌గారి ముఖం కందగడ్డలా అయింది. 'రామచంద్రుడూ ! నువ్వదృష్టవంతుడివోయ్ ! ఉన్న ఒక్క కూతుర్నీ బామ్మరిది కిచ్చుకున్నావ్. కొడుకులు లేరు. అది మరీ అదృష్టం !'

'సర్ !'

'అవునోయ్ ! నాకు నలుగురు కొడుకులు. ఒకడు డిఫెన్స్‌లో, మరోడు సెక్రటరియేట్‌లో, ఇంకోడు ఏర్‌వేస్‌లో, ఆఖరివాడు టెలీ కమ్యూని కేషన్స్‌లో పని చేస్తున్నారు. ఏం లాభం... మొదటి వారం దాటినతర్వాత నేను ఎదురు తెన్నులు చూడాల్సిందే తప్ప పైసా పంపడు ఎవడూ ! థాంక్‌లెస్ పీపుల్ !'

సమాధానం యివ్వకుండా కదిలాడు రామచంద్రుడు. మరో వంద గజాలు నడవగానే 'నమస్కారమండీ !' అంటూ ఎదురయ్యాడు ఓ యువకుడు.

'నమస్తే నమస్తే !'

'ఏమైనా ?'

'ఆ రెండున్నాయి !' భుజానికున్న సంచిలోంచి తీస్తూ అన్నాడు. ఆ యువకుడి ముఖం మాడిపోయింది.

కానీ రామచంద్రుడు యిచ్చినవాటిని చూడగానే అతని ముఖం విప్పారింది. అందులో ఒకటి ఓ వారపత్రిక. అందులో అతని కథ అచ్చయింది. ఇంటిమేషన్ లేకుండానే అచ్చేసుకున్నారు. ఆరేడు నెలల తర్వాత. చాలా సంతోషించాడు కృష్ణమోహన్. మరొకటి ఓ మాసపత్రిక నుంచి కథ అంగీకరించి నట్టు ఉత్తరం. అతని ఆనందానికి హద్దులేదు. అవి రెండూ అతని తొలి విజయ వార్తలు.

'మరొక్కటి !'

'ఇంకానా ?' ఉత్సాహంగా అడిగాడు.

'అవును. అయితే ఇది తిరిగొచ్చిన కథ !' నవ్వుతూ అన్నాడు.

'ఫరవాలేదులెండి ! రాసినవన్నీ అచ్చవుతాయా ! స్పోర్టివ్‌గా తీసుకోవాలి !' నవ్వేడు.

'కృష్ణా ! నువ్వు మన వూరికి పోస్టాఫీసు రావాలనేవాడివి. ఇప్పుడు చూడు. నీ కథ సోమవారం తిరిగొచ్చింది. ఆ ఉత్తరం బుధవారం వచ్చింది. ఈ రోజు ఆ పత్రిక వచ్చింది. నీకు ఉత్సాహంగా ఉండాలని యిలా మార్చి యిచ్చాను. అదే నువ్వనుకున్నట్టయితే నీకు ఎంత నిరుత్సాహంగా వుండేది ఈ వారారంభం !' నవ్వుతూ అని ముందుకి కదిలేడు రామచంద్రుడు.

'ఈసారి నారం మనియార్డరు!' అనుకున్నాడు కృష్ణ.

మరో వీధికి మళ్లి లక్కడ వుత్తరాలు యిచ్చి తన వూరి దారిపట్టేడు రామచంద్రుడు. ఊరి చివరిగా అతని దారిలో వున్న మరో యింట్లో ఓ ఉత్తరం యిస్తే అతని డ్యూటీ అయినట్టే.

ఆ యిల్లు కరీంది. అక్కడ ఎప్పుడూ రామ నామం వినిపిస్తూ వుంటుంది. అది ఆ వూరివాళ్లకి

భద్రాద్రి. అతను రామదాసు. అతనిది ఏ వూరో ఎవరికీ తెలియదు. ఎక్కడివాడో తెలియదు. ఉద్యోగం చేశాక రిటైర్ అయి యిక్కడికి వచ్చాడు. ఈ పాతికేళ్ళుగా అతను వూరివారికి భక్తశిరోమణిగా అయ్యేడు. అతనికి భార్యలేదు. ఉన్న ఒక్క కొడుకూ మిలిటరీలో చేరిపోయాడు. నెల నెలా డబ్బు పంపుతూ వుంటాడు. ఏడాదికో, రెండేళ్ళకో వచ్చి వెళుతూ వుంటాడు భార్యా, పిల్లలతో. నెలో రెండు నెలలో వుండి వెళతాడు.

'కరీం భాయ్ !' కేకేశాడు రామచంద్రుడు.

'రామచంద్రా !' గొంతులో తీయదనం వెల్లివిరుస్తూ వుండగా బదులు పలుకుతూ బయటికి వచ్చాడు కరీం. తెల్లటి జుబ్బా, కలర్ గళ్ళలుంగీ, తెల్లగా రొమ్ము దాకా వ్యాపించిన గడ్డం, పెరిగిన శిరోజటలు ... పల్లెల్లో బతుకుతున్న ఋషిలా వుంటాడు కరీం.

'మనియార్డరు వచ్చిందా భాయ్ !'

'ఎప్పుడూ డబ్బు ఏంతేనా భాయ్ ! కొడుకు యోగక్షేమాలు తెలుపుతూ వుత్తరం రాశాడా అని అడగవేం ?'

'రామచంద్రా ! డబ్బు కోసం కాదయ్యా ! మనియార్డరయితే త్వరగా సంతకం చేసేస్తే నువ్వు వూరికెళతావుగా ! పాపం నీ భార్య ఎదురు చూస్తూ వుండదూ అందుకని !'

నవ్వేశాడు రామచంద్రుడు. ఉత్తరం అందించాడు. అది చించి 'ఇదేదో ఇంగ్లీషులో ఉత్తరం వుందయ్యోయ్ ! నువ్వే చదివిపెట్టు !' అన్నాడు కరీం.

'నీ కొడుకు గొప్పోడయిపోయాడు. నాయనకి ఇంగ్లీషులో ఉత్తరం రాసేంత పైకిపోయాడు. ఇంకేం ! పెద్ద ఉద్యోగమే అయివుంటుంది. స్వర్గ సుఖాలు అనుభవిస్తూ వుంటాడు !' అని ఉత్తరం చదవడం ప్రారంభించాడు.

'ఇదిగో రామచంద్రా ! ఎప్పుడు చదువుకున్న చదువో—ఒక్కో ముక్కే అర్థం చేసుకుని నిదానంగా చదువు. ఇంకా చీకటి పడలేదులే !' నవ్వుతూనే అన్నాడు కరీం.

నిదానంగా పదం పదం కూర్చుకుంటూ చదవ సాగాడు రామచంద్రుడు. అతనికి ఉత్తరం చదివే కొద్దీ మతిపోతున్నట్టుంది. అప్పుడే చీకటి కమ్మినట్టుంది.

అది డిఫెన్స్‌వాళ్ళు రాసిన ఉత్తరం. డ్యూటీలో వున్న రహీం బోర్డరు రక్షణలో వుండగా, అవతలి సరిహద్దు నుంచి ఎవడో ద్రోహి విసిరిన బాంబు దెబ్బకి బలి అయిపోయాడు రహీం. అతని దేశ సేవని అభినందిస్తూ, అతని త్యాగాన్ని పొగడుతూ, అతడి తండ్రికి పెన్షన్ ఏర్పాట్లు చేస్తూ రాశారు వాళ్ళు.

'ఇతను బతికినన్ని రోజులు యిక బతకడు. డబ్బు ఎలాగూ ప్రభుత్వం పంపుతుంది. ఇప్పుడీ విషయం చెప్పి యితన్నెందుకు బాధపెట్టాలి. ఏకపుత్ర వియోగ వ్యధకెందుకు గురిచెయ్యాలి ? ఒక చిన్న అబద్ధం ఆడి యితన్ని తృప్తి పరుస్తాను!'

'ఏం రామచంద్రా ! ఇంగ్లీషు బొత్తిగా మరిచిపోయావా ఏమిటి ? నాకే యిచ్చెయ్. రేపు వెలుతుర్లో తీరిగ్గా చదువుకుంటాను !' సదా వెలిగే చిరునవ్వుతో అన్నాడు కరీం.

'అహ అదికాదు భాయ్ ! నీ కొడుకు వీరోచిత కృత్యం చేశాడట ! అందుకే అతనికి ప్రమోషన్ యిచ్చారట. జీతం పెరిగింది కాబట్టి యిక నీకు నెల నెలా ఎక్కువ డబ్బు యిస్తాడట !' తడబాటు నణుచుకుని గబగబా అన్నాడు రామచంద్రుడు.

'అహా అలాగా'

'ఆఁ అవును !' లేస్తూ అన్నాడు.

'అరే ! ఉత్తరం నువ్వే తీసికెళుతున్నావేం భాయ్ !'

తడబడ్డాడు రామచంద్రుడు ఏం జవాబు చెప్పాలా అని.

'పోన్లే ! జాబు చదివేశావు కదా ! ఇంకెందుకులే నాకు ! నువ్వే వుంచేసుకో !' మళ్ళీ నవ్వుతూ అన్నాడు.

'బ్రతికించావు !' అనుకుని జేబులో పెట్టుకుని 'పోనీ ! నువ్వే వుంచుకో !' అన్నాడు రామచంద్రుడు సైకిల్ కదిలిస్తూ.

'రాముడు నిన్ను కాపాడుతాడు ! వెళ్లిరా !' అన్నాడు కరీం ఇక ఆ ఉత్తరం సంగతి ప్రస్తావించకుండా.

రామచంద్రుడు సైకిలెక్కాడు.

'రామచంద్రా ! నువ్వెంత మంచివాడివి. నా కొడుకు చనిపోయాడని తెలిస్తే నేనేమయి పోతానో అని భయపడ్డావు. చిన్న అబద్ధం ఆడేశావు. జీవితాంతం ఇక వాతో అబద్ధాలే చెప్పాలి నువ్వు ! అయినా నువ్వెంత గొప్పవాడివి బాబూ ! నిజంగా నువ్వు మనిషివి. నీలాటివాళ్ళు చల్లగా వర్ధిల్లాలి.

నువ్వు చదివేప్పుడే నేనూ ఆ ఉత్తరం అలా అలా చూశాను. అది డిఫెన్సువాళ్ళు రాసే వుత్తరమని చూడగానే గ్రహించుకున్నాను. వాళ్లెప్పుడు తల్లిదండ్రులకి రాస్తారు ? కొడుకులు వీరస్వర్గం అలంకరించినప్పుడే ! రామచంద్రుడూ ! నా కొడుకు మిలటరీకి వెళ్లినవాడే దేశమాత పుత్రుడయ్యాడు. దేశభక్తుడయ్యాడు.

వాడివి గురించి నేనీనాడు గర్విస్తున్నాను ! అంతేకాదు. వాడెంత గొప్పవాడో నువ్వూ అంతటి గొప్పవాడివే ! నిన్ను అభినందించాలి అందరూ !

రామచంద్రా ! నిన్ను భగవంతుడు చల్లగా చూడాలి ! నువ్వు నిండు నూరేళ్ళూ బ్రతకాలి !'

అస్తమిస్తున్న సూర్యకాంతిలో సైకిలెక్కి వెళుతున్న రామచంద్రుడు ధ్రువతారలాగా కనిపిస్తూ వుంటే, కరీం శుక్రతారలా వెలిగిపోతున్నాడు. ★


త్వరలో

రాగజ్వాల

సీరియల్ ప్రారంభం !



# సాంకేతిక విజ్ఞాన గ్రంథములు

విశ్రాంతి సమయంలో ఇంట్లోనే వుండి ఆయా పనిముట్లను సరిచేసుకునే వారికి, విద్యా సంస్థలలో చేరి విద్యనభ్యసించేవారికి, వివిధ సంస్థలలో పని చేసుకునేవారికి అతి సులభముగా అర్థమయేటట్లు చిత్రాలతో వివరించివున్నాము. ప్రతి ఇంటా వుండి అందరికీ ఉపయోగపడే ఉత్తమ గ్రంథములు.

| | వెల రూ. | | వెల రూ. |
|---|---|---|---|
| ట్రాన్సిస్టర్ రిపేరింగ్ | 3-50 | వాల్వు రేడియో రిపేరింగ్ | 10-00 |
| ట్రాన్సిస్టర్ రేడియో | 3-50 | టేప్ రికార్డర్ | 5-25 |
| హౌస్ వైరింగ్ | 5-75 | టి.వి. మెకానిజం | 5-25 |
| మోటార్ రివైండింగ్ | 5-25 | మోటార్ మెకానిజం | 6-00 |

మీరు పుస్తకాలకు ఆర్డర్ చేసేటప్పుడు పుస్తకాల వెలలో తప్పనిసరిగా సగం అడ్వాన్సుగా పంపాలి. మిగతా సొమ్ముకు వి.పి.గా పంపుతాము.

Also learn all our National Languages in 30 days through your mother tongue

Balaji Publications
103, Pycrofts Road, Madras-600 014